# ఆశ్రయం

సంధ్య వాచీ చూసుకుంది.

సమయం పదీ నలభై...

పక్కన కూర్చున్న ముసలావిడ ''అమ్మాయ్! నిద్రొస్తోంది. బెర్త్ దించేద్దామా'' అంది.

ఆవిడది మిడిల్ బెర్త్...

సంధ్యకి నిద్ర రావడంలేదు. కానీ పాపం ఆవిడని ఎంత సేపు కూర్చోబెట్టగలదు!

మెల్లిగా లేచి హ్యాండ్‌బ్యాగ్ బెర్త్‌కింద పెట్టిబెర్త్ దించింది. ఆవిడ కూడా సంధ్యకి సాయంచేసింది.

ఆవిడ భర్త కాబోలు ముసలాయన ఎదురుగా ఉన్న లోయర్ బెర్త్ మీంచి లేచి, సంధ్య దించిన మిడిల్ బెర్త్‌పైకి చేరాడు. ఆవిడ ఎయిర్ బ్యాగ్‌లోంచి దుప్పట్లు తీసి ఆయనకి రెండు ఇచ్చింది. తనో రెండు తీసుకుని ఒకటి బెర్త్‌మీద పరిచి, ఒకటి తలవైపు పెట్టుకుంది. పడుకోబోతూ సీట్లో వంగి కూర్చుని కిటికీ గుండా బైటకి చూస్తోన్న సంధ్యని చూస్తూ ''నీకు నిద్రరావడంలేదా అమ్మాయ్!'' అంది.

సంధ్య కొంచెం మందహాసం చేసి ''లేదండీ'' అంది.

''ఎక్కడికెళ్ళాలేంటి?'' మళ్ళీ అడిగింది.

''రాజమండ్రి వెళ్ళాలండీ''

''అలాగా! ఒక్కదానివే వెళ్తున్నట్టున్నావే... పెద్దవాళ్ళెవరూ లేరా?'' ఒక్క హ్యాండ్ బాగ్ తప్ప మరే లగేజీ లేని సంధ్యని వింతగా చూస్తూ అడిగింది.

సంధ్య మాట్లాడలేదు. నిశ్శబ్దంగా కిటికీలోంచి బైటికి చూస్తూ కూర్చుంది.

సంధ్య సమాధానం చెప్పకపోవడంతో మళ్లీ అన్నదావిడ.

''రాజమండ్రి చేరేటప్పటికి అర్ధరాత్రి అవుతుంది. ఇంత చీకట్లో... ఆ వేళప్పుడు ఎక్కడికెళతావు? మీ బంధువులెవరన్నా స్టేషన్‌కి వస్తారా?''

సంధ్య రారన్నట్టు తల వూపింది...

''లేదండీ.. ఎవరూరారు.. నేను అనుకోకుండా ప్రయాణమయ్యాను. ముందుగా తెలియచేసే అవకాశం లేకపోయింది.''

''అరే! మరెలా?''

''తెల్లవారిందాకా స్టేషన్‌లో ఉండి తెల్లారాక ఊళ్ళోకి వెళ్తాను''

ఆవిడ ఆవులిస్తూ ''జాగ్రత్తమ్మా... ఆడపిల్లవి... అసలే రోజులు బాగాలేవు'' అంది.

కళ్ళు మూసుకుని పక్కకి ఒత్తిగిల్లింది.

సంధ్య నిట్టూర్చింది... సృష్టికి తారురోడ్డు వేసినట్టు బైటంతా నల్లగా ఉంది.. రైలు శబ్దం, కిటికీలోంచీ వీస్తోన్న గాలి శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

''జాగ్రత్తమ్మా సంధ్యా... వాడివ్వనంటే గొడవ పెట్టుకోకు'' అమ్మ కంఠస్వరం... చెవుల్లో మార్మోగింది.

'' ఎంత భయం అమ్మకి! కొడుకు రెక్కలు రాగానే తమని నిర్లక్ష్యం చేసి ఎగిరిపోతే... అతని స్వార్థం చూసి కోపగించుకోవాల్సింది పోయి.. భయపడుతోంది. మా ఖర్మ అంతే అని సర్దిచెప్పుకుని ఓదార్పు పొందుతోంది. అందుకేనేమో అమ్మని క్షమామూర్తి అని మాతృదేవత అనీ అంటారు!

గర్భం దాల్చిన దగ్గరినుంచీ వంశాంకురం, వంశాంకురం అంటూ ఆ శిశువు ఉనికికోసం అనుక్షణం తపిస్తూ, కంటికి రెప్పలా కాపాడి ఎన్నో కష్టనష్టాలకోర్చి పెద్ద చేసిన ఆ కొడుకు తనకు రెక్కలు అమర్చిన ఆ చేతుల్నే నరికి ఎగిరిపోయాడు. అలాంటి కొడుకుని తల్చుకుని నాన్న ఆగ్రహించినా, అమ్మ ఆయననే అనునయిస్తూ కొడుకుని సమర్థిస్తోంది.

రేపు తనైనా అంతేనా!

సంధ్యకి భయంవేసింది

అన్నయ్యలాంటి కొడుకు తనకి పుట్టకూడదు.

కానీ వాడి పరిస్థితి ఏమిటో? వాడి సమస్యలేమిటో...?

''మనకేం తెలుసు... అక్కడ వాడెన్ని ఇబ్బందులు పడుతున్నాడో'' అంటుంది అమ్మ.

''కావచ్చు.. కానీ పెళ్ళై వెళ్ళి రెండేళ్ళవుతోంది. వాడూ, కోడలూ ఒక్కసారన్నా వచ్చారా? మన ఆలనా పాలనా కనుక్కొనే బాధ్యత కొడుకుగా వాడికి లేదా? కనీసం ఉత్తరం ముక్క రాసేంత తీరిక లేకుండా వాడు చేసే రాచకార్యాలేముంటాయి?'' అంటారు నాన్న కోపంగా.

కనీసం తల్లిదండ్రుల క్షేమసమాచారలన్నా కనుక్కోకుండా పరాయివాడిలా ఉండగలిగేంత కాఠిన్యం ఉన్నవాడు చెల్లెలి ఇంజనీరింగ్ చదువుకి ఆర్థిక సాయంచేస్తాడా? తను అనవసరంగా ఛార్జీలు తగలేసి వెళ్తోందేమో!

సంధ్యకి భయంవేసింది.

ఎమ్సెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకున్న తనకి గవర్నమెంట్ కాలేజీలో సీటొచ్చింది. అయినా ఎంత లేదన్నా ఓ ఐదారు వేలు కావాలి మొదటి సంవత్సరం... నాలుగేళ్ళు పూర్తయ్యేటప్పటికి కనీసం మరో పదిహేను, ఇరవై వేలవుతుంది. నాన్న భరించడం అసాధ్యం. అన్నయ్య కనీసం సగమన్నా భరిస్తే, తను ఎలాగోలా కష్టపడి ఇంజినీర్ అయి తన జీవితాశయాన్ని సాధించవచ్చు. అంతగా లేదంటే అప్పుగా ఇవ్వమని అడగాలి. చదువు పూర్తవగానే ఉద్యోగం తప్పకుండా వస్తుంది. అప్పుడు తీర్చేయొచ్చు.

ఇదే మాట అమ్మకీ, నాన్నకీ చెప్పి వాళ్లని ఒప్పించి ఆశగా బయల్దేరింది.

ఈ ప్రయాణం మంచి ఫలితాన్నిస్తుందో? లేక నిరాశని మిగులుస్తుందో?

ఆ బెర్త్ కూర్చోడానికి వీలుగా లేకపోవడంతో మెడ నొప్పిగా అనిపించింది.

హ్యాండ్‌బాగ్ తలక్రింద పెట్టుకుని పడుకుంది. అటు పక్క బెర్త్‌లమీద నలుగురు యువకులు పేకాడుతున్నారు. నిశీధి నిశ్శబ్దాన్ని చీలుస్తూ, ప్రయాణ సందడి.

చాలామంది రైల్లో నిద్రపోరు. పేకాడుతూనో, పాటలు, కబుర్లతోనే కాలక్షేపం చేస్తారు. కొందరు మాత్రం రైలెక్కగానే హాయిగా నిద్రపోతారు. కొందరికి ప్రయాణం విశ్రాంతిని, కొందరికి ప్రయాణం ఓ చక్కని అనుభూతినో, వినోదాన్నో కలుగజేస్తుంది. కానీ, ఈ ప్రయాణం తనకి నిద్రనీ, మన శ్శాంతినీ కూడా దూరం చేస్తోంది. జోరీగల్లా ముసురుకుంటోన్న ఆలోచనలు, అగమ్యగోచరంగా ఉన్న భవిష్యత్తు. సుడిగాలిలో కొట్టుకుంటోన్న ఆశాదీపంలా!

ఓ చిన్న కోరిక! ఆశయం. నెరవేరుతాయో, లేదోనన్న సంశయం.

సంధ్య కళ్ళు మూసుకుంది.

సంధ్య కళ్ళు తెరిచేటప్పటికి రాజమండ్రి స్టేషన్ వచ్చేసింది. హ్యాండ్‌బ్యాగ్ తీసుకుని గబగబా రైలు దిగింది. ఆమెతోపాటు ఇంకా కొందరు దిగారు. మరికొందరు ఎక్కారు.

సంధ్య బితుకుబితుకువంటోన్న గుండెతో చుట్టూ చూసింది. ఫర్వాలేదు. కొంచెం సందడిగా ఉంది అనుకుంది ధైర్యం చెప్పుకుంటూ!

వాచీ చూసుకుంది. దాదాపు మూడుకావస్తోంది. కనీసం రెండుగంటలసేపు ఈ స్టేషన్‌లో గడపాలి. ఎలా! కళ్ళు మంటగా ఉన్నాయి. కాస్త దూరం నడిచి స్టేషన్ క్యాంటిన్ ముందికి వెళ్ళింది. అప్పటిదాకా ఉన్న సందడి సద్దుమణిగింది. రైలు వెళ్ళిపోయింది. రైల్లోంచి దిగిన ప్రయాణీకులు కూడా వెళ్ళిపోయారు. స్టేషన్‌లో అక్కడక్కడా కొందరునిద్రతో జోగుతున్నారు. సంధ్య కాంటీన్ దగ్గరికెళ్ళి 'టీ' ఇవ్వమంది, బ్యాగ్‌లోంచి డబ్బులు తీయబోతూ పక్కకి తిరిగి చూసింది.

నలుగురు వ్యక్తులు.. బాగా తాగినట్టున్నారు. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. పెద్ద పెద్ద మీసాలు, సంధ్యవైపు వెకిలిగా చూస్తూ ఏదో అంటున్నారు. అందులో ఒకతను '' ఏ ఊరు పాపా మస్తి'' అన్నాడు.

పైప్రాణం పైనే పోయినట్టయింది. క్యాంటీన్ కుర్రాడు టీ గాజుగ్లాసులో పోసి ఇచ్చాడు. ఆమె తల వంచుకుని టీ తాగసాగింది.

'' ఒరే! తిప్పా మాకూ ' ఇవ్వరా టీ' ఆ నలుగురూ క్యాంటీన్‌వైపు సంధ్యకి దగ్గరగా వస్తూ అన్నారు.

ఆమె చేతిలో గ్లాసు వణికింది.

అంత చలిలో కూడా చెమటపట్టేసింది. గ్లాసు పక్కన పెట్టిబ్యాగులోంచి చిల్లర తీసి క్యాంటీన్ అతనికిచ్చింది.

అక్కడినుంచి కదిలి నడిచి, స్టేషన్‌బైటికి వచ్చేసింది. వెనక్కి తిరిగి చూస్తే వాళ్ళూ వెనకే వస్తున్నారు. సంధ్య గబగబా నడిచి, నిద్రపోతోన్న ఓ రిక్షా అతణ్ణి లేపింది. తన చేతిలో ఉన్న అడ్రస్ కాగితం చూసి, అడ్రస్ చెప్పి రిక్షా ఎక్కి కూర్చుంది. అతను నిద్రలేపినందుకు ముందు కోప్పడ్డా, ఆమె వాలకం. భయం.. వెనకాల వస్తోన్న రౌడీలను చూసి మారుమాట్లాడకుండా రిక్షా పోనిచ్చాడు.

కొంతదూరం వెళ్ళేప్పటికి రిక్షా టైరులో గాలి పోయింది. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. సంధ్యకి చాలా భయం వేసింది. చలి వేస్తోంది. గోదావరి మీంచి చల్లని గాలి కెరటాలు వీస్తున్నాయి.

''అమ్మాయిగారూ! మీరు చెప్పిన ఇల్లు ఈడికి దగ్గరేనండమ్మా... పోగలరా'' అన్నడు రిక్షా అతను.

సంధ్య దిగులుగా చూసి, ఉసూరుమంటూ రిక్షా దిగింది. అతనికి డబ్బులిచ్చి గబగబా అడుగులూ వేస్తూ ముందుకు నడిచింది.

గాలి ఉండుండీ తీవ్రంగా వీస్తోంది. సన్నగా వణుకు ప్రారంభమైంది ఆమెకి. ఆ వణుకు చలివలననో, భయంవలననో అర్థంకాలేదు. పమిటచెంగు భుజాలచుట్టూ కప్పుకుని నడుస్తోంది.

ఉన్నట్టుండి పెద్ద పెద్ద చినుకులు పడసాగాయి. సంధ్య ఓసారి కళ్ళెత్తి ఆకాశం వంక చూసింది.

మదపుటేనుగుల్లా నల్లని మేఘాలు ఒకట్నొకటి డీకొట్టుకునేలా ఉన్నాయి.

అమ్మో! వర్షం పెద్దదయేలా ఉందే! ఆమె ఆగిపోయింది. పెద్ద మర్రిచెట్టు భూమిపైకి వెళ్లాడే ఊడలతో ముప్పాతిక భాగం ఆక్రమించిన మొదళ్లతో ఉంది. దాని కొమ్మలు రాజమండ్రంతా వ్యాపించినట్టు అనిపిస్తున్నాయి. గబగబా వెళ్లి ఆ చెట్టుక్రింద నిలబడింది. అప్పటికే అక్కడ పడుకున్న ముష్టివాళ్లు ఇద్దరూ కదిలారు. ముసలాడు దగ్గుతున్నాడు. ' ఓరూ'' అన్నాడు దగ్గుతూ, సంధ్యకి

మళ్లీ భయం వేసింది. మాట్లాడకుండా నిల్చుంది. '' ఓరులేరులే.. ఆడబిడ్డ.. అనకి తడుస్తోంది... కూసోబిడ్డా!'' ముసలాడికి జవాబు చెప్తూ సంధ్యని చూసి అంది ముసలవ్వ.

''ఫర్వాలేదులే'' చీరచెంగుతో మొహం మీద పడిన వానచినుకులు తుడుచుకుంటూ అన్నది. ముసలవ్వ లేచి తన చేతి సంచీలోంచి ఓ చిరుగుల చీర తీసి అందిస్తూ అంది.. '' ఇంద దీన్తో తుడుచుకో అసలే తడిసిన చీర! దాంతో ఏం తుడుసుకుంటావు?'' సంధ్యకి కడుపులో దేవినట్లైంది. ఆ చీర నుండి వస్తోన్న దుర్వాసనకి కొంచెం చిరాకుపడుతూ అంది, '' ఏం వద్దు వర్షం తగ్గింది వెళ్లిపోతాను''

'' ఈ రేతిరేల ఏడకి బోతవు బిడ్డా! రోజులు మంచివికావు కూసో. తెల్లారింతరువాత పోదువులే' గాలికి విశృంఖలంగా ఊగుతూన్న చెట్ల శబ్దంలో అవ్వ మాటలు కలిసిపోయాయి. సంధ్య అక్కణ్ణుంచి గబగబా నాలుగు ఫర్లాంగులు నడిచింది. రెండేళ్ల క్రితం చూసిన సందుని, ఇల్లుని తన చేతిలో ఉన్న టార్చిలైటు వెలుగు ఫోకస్ చేసి చూసింది. వరుసగా ఉన్నాయి ఇళ్లన్నీ. దాదాపు నాలుగైదు పోర్షన్ల కష్టంమీద పోల్చుకుంది. ''హమ్మయ్య ఇల్లొచ్చేసింది'' హాయిగా ఊపిరి పీల్చుకుంది.

వరండాలోకి వెళ్లి తలుపు తట్టింది... లోపల్నించి సమాధానంలేదు. రెండుసార్లు తలుపు తట్టాక బద్ధకంగా వినిపించింది లోపల్నించి ఓ కంఠం '' ఎవరూ!''

''తలుపు తీయండి.. నేనే సంధ్యను'' కొంచెం గట్టిగానే అరిచింది.

కొన్ని కణాల తరువాత తెరుచుకుంది. ఓ లావుపాటావిడ తలుపుతీసి తలుపుకడ్డంగా నిల్చుని నిద్రమత్తు, కాఠిన్యం కలగలిపిన గొంతుతో అడిగింది, '' ఎవరు నువ్వు?''

సంధ్య నోటమాట రాలేదు. అబ్బ ఎంత దురుసుతనం! అనిపించింది. కూడబలుక్కుంటూ అడిగింది, ''నరేంద్ర లేడా... మీరు''

''నరేంద్ర ఎవరు? ఎవర్నువు ఈ అర్ధరాత్రి ఏమిటీగోల?'' ఆవిడ ఉరిమినట్లుగా అడిగింది.

' ఎవరు సరస్వతీ!'' లోపల్నించి ఎవరిదో మగవాళ్ల కంఠం వినిపించింది.

'' ఎవరూ లేరు. పడుకోండి మీరు.. వెళ్లమ్మాయ్. ఈ ఇంట్లో నరేంద్రలెవరూ లేరు'' ఆవిడ ఠకీమని తలుపేసుకుంది.

చాలా అవమానకరంగా ఫీలైంది సంధ్య, తను పొరపడిందా... లేదే! ఇదే ఇల్లు... రిషా అతను కూడా చెప్పాడు ఇదే ఏరియా అని. సంధ్య ఆలోచిస్తుండగా లోపల్నించి వినిపించింది. ''నరేంద్ర అంటే బ్యాంక్ మేనేజర్. మనకన్నాముందు ఉండేవాళ్లు. ఇల్లు ఖాళీ చేశాడు. ఎక్కడున్నాడో పాపం! ఎవరావచ్చిందీ?'' పెద్దాయన స్వరం.

'' ఆ ఎవరో మనకెందుకు దారిన పోయే తద్దినం, పడుకోండి'' ఆవలిస్తూ ఆవిడ స్వరం.

'' ఛ... ఎంత కుసంస్కారం ఈవిడలో'' సంధ్యకి అసహ్యమేసింది.

అన్నయ్య ఖాళీ చేశాడా? ఎక్కడికెళ్లినట్టు! ఎవర్నడగాలి? ఆలోచిస్తూనే పక్కపోర్షన్ దగ్గరకెళ్లి తలుపుకొట్టింది.

రెండుసార్లు కొట్టాక తలుపు తెరుచుకుంది. దాదాపు అరవై ఏళ్ళ వయసున్న పెద్దమనిషి తలుపు తీసి '' ఎవరమ్మా'' అన్నాడు.

అయన పలకరింపులోని మార్దవానికి, మర్యాదకి సంధ్యకిపోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయి ప్రాధేయపూర్వకంగా అడిగింది.

''నేను హైదరాబాద్ నుంచి వస్తున్నానండి. ఈ పక్క ఇంట్లో నరేంద్ర అని ఉండేవాడు.. మా అన్నయ్య. తనెక్కడ ఉన్నాడో చెప్పగలరా!''

''తెలీదమ్మా.. నేనూ ఈ మధ్యే వచ్చాను ఇక్కడికి. అరె? వర్షంలో తడుస్తున్నావే.. లోపలికి రామ్మా'' పక్కకి తొలుగుతూ ఆహ్వానించాడు.

''ఫర్వాలేదండీ'' మొహమాటంగా అన్నది.

''రామ్మా.. ఏం భయంలేదు, పెద్దవాణ్ణి..'' సంధ్యకి ఎడారిలో పన్నీటి జల్లులా వినిపించిందామాట... నిస్సంకోచంగా లోపలికి నడిచింది.

ఆయన లోపలికెళ్లి టవల్ తెచ్చి ఇస్తూ ''తల తుడుచుకో ఇంట్లో ఎవరూ లేరమ్మా.. ఒక్కణ్ణే' అన్నాడు.

సంధ్య ఉలిక్కిపడి ఆయన వంక చూసింది. నెరసిన జుట్టు, మీసాలు, హుందాగా కన్పిస్తున్నాడు.

''నా భార్య చనిపోయింది.. పిల్లలిద్దరూ అమెరికాలో ఉన్నారు. నాకీ పక్క గ్రామంలో పొలాలు, ఇల్లు ఉన్నాయి. ఇటీవలే రిటైర్ అయ్యాను''.

సంధ్య అలాగా అన్నట్లు నవ్వి ఊరుకుంది. ఆయన టవల్ ఇస్తూ అన్నాడు., ''మొహమాటపడకు తీసుకో.. బైట వర్షంగా ఉంది. తలుపు వేస్తాను''

సంశయంగా టవల్ అందుకుంటూ వాచీ చూసుకుంది టైము మూడు నలభై అయింది. ఈ ఊళ్లో ఈ అర్ధరాత్రి తనకి చిన్న షెల్టర్ దొరకడానికి గంటసేపు పట్టింది. దీన్ని అదృష్టం అనాలా ఖర్మ అనాలా! నవ్వుకుంది.

ఆయన తలుపేసి వస్తూ.. ''తెల్లారిందా కాసేపు రెస్ట్ తీసుకోమ్మా.. ఇంటి ఓనర్స్ ఇక్కడే ఉన్నారు. తెల్లారాక వాళ్లనడిగి మీ అన్నయ్య అడ్రస్ సంపాదిద్దాం'' అన్నాడు.

''థాంక్సండీ'' కృతజ్ఞతగా అన్నది.

ఆయన మంచం మీద పడుకోమంటే వద్దని చాప తలగడ తీసుకుని పరుచుకుంది. ఆయన బెడ్‌రూమ్‌లోకెళ్లిపోయాడు.

లైట్ తీసేసింది. బెడ్‌లైట్ వెలుగుతోంది. ఏమిటీ విచిత్రం. ఎంత ధైర్యం తనకి! ముక్కూమొహం తెలియని వ్యక్తి ఇంట్లో అర్ధరాత్రి అయాచిత ఆశ్రయం.. ఈ ప్రయాణం. తను తొందరపడి అనాలోచితంగా బయల్దేరి వచ్చిందా? అన్నయ్య అడ్రస్ దొరుకుతుందా? అయినా వాడికి ఎంత నిర్లక్ష్యం! ఇల్లుమార్చినట్లు ఓ కార్డు రాయచ్చుకదా! భగవంతుడా! త్వరగా తెల్లారితే బాగుండును.. సంధ్య కళ్లమీదికి నిద్ర ముంచుకొచ్చింది.

నిద్రలో పిచ్చిపిచ్చి కలలు. ఆ కలలో తను దారితప్పి ఎటో ప్రయాణిస్తోంది. దారంతా ముళ్లకంపలు, కొండలు, రాళ్లా చాలా భయంకరంగా ఉంది. ఎవరో తనని వెంబడిస్తున్నారు. తను పరిగెత్తుతోంది. వాళ్లు దగ్గరికివచ్చారు. తనని వడిసి పట్టుకున్నారు. తను పెనుగులాడుతోంది, అరుస్తోంది, ఏడుస్తోంది. అయినా అవతలి వ్యక్తి బలంముందు తను నిస్సహాయురాలై పోతోంది. తనని ఎవరో నొక్కుతున్నారు... రక్కుతున్నారు.

కెవ్వున అరిచింది సంధ్య... ఇది కలా? నిజమా! నిద్రమత్తులో అలిసిపోయిన ఆమెకు జరిగేది త్వరగా అర్థంకాలేదు. అర్థమయేటప్పటికి

తండ్రిలాంటి ఆ ముసలాయన ఏం చేయబోతున్నాడో గ్రహించింది. హుందాగా, గంభీరంగా కనిపించిన ఆ పెద్దమనిషి..!

సంధ్య వికృతంగా అరిచింది. బలమంతా ఉపయోగించి తనను ఆక్రమించకోజూస్తున్న ఆయన్ని దూరంగా తోసేసింది. ఆకలితో ఉన్న మృగంలా కనిపిస్తున్న ఆయన మొహాన కాండ్రించి ఉమ్మి విసురుగా బైటికి వచ్చింది.

బైట హోరున కురుస్తున్న వాన... ఎముకల్ని కొరికేసే చలి.. కానీ ఆమె గుండెల్లో ప్రపంచాన్ని తగలేయాలన్నంత అగ్ని, భయంకర ప్రమాదాన్నుండి తప్పించుకున్నానన్న ఉద్వేగం...

ఆమె కళ్లల్లోంచి అశ్రు ప్రవాహం... నడక... పరుగులాంటి నడక.. అలసట.... ఏడుపు... కబంధ హస్తాల్లో నలగబోయిన శరీరబాధ! నీరసం... నిస్సహాయత... కసి... దుఃఖం.

సంధ్య వచ్చిన దారినే ఆ చెట్టు దగ్గరికి రాగానే నిస్సత్తువగా కూలబడింది. ఆ మర్రిచెట్టు క్రింద రెండు చేతులూ మొహానికి అడ్డంగా పెట్టుకుని వెక్కివెక్కి ఏడుస్తూ... పెద్ద పెద్ద ఊడలు వృదువైన హస్తాలుగా మారి ఆమెని చేరదీశాయి.. ఆమె ఏడుపు విన్న ముసలవ్వ లేచి కర్రసాయంతో నడిచి సంధ్య దగ్గరికి వచ్చింది. '' ఎవరు బిడ్డా నువ్వు ఏ ఊరు నీది? ఏమైంది?''

ఆ ఆప్యాయతకి చలించిపోయింది సంధ్య... ఇంతకుముందు తను చీదరించుకున్న అవ్వే ఈ అవ్వ! ఎంత ఆప్యాయంగా పలకరిస్తోంది! తనామెని చీదరించుకున్నానన్న ధ్యాసగానీ, బాధకానీ ఆమెలో ఏ కోశానాధ్వనించటం లేదు.

ఆ చీత్కారాలకీ, పలకరింపులోని ఆప్యాయతకి కారణం?

సంస్కారమా? లేక వయసుతో వచ్చిన మమతానురాగాల వెల్లువా? లేక సాటి ఆడది కావటమా?

ఈ ఆప్యాయతనీ, ఈ సంస్కారాన్ని తను ముందే గ్రహించి ఉంటే తనింత బాధపడాల్సి వచ్చేదా?

సంధ్య గుండెల్ని చీల్చుకుంటూ పొంగింది కన్నీటి కడలి.

ఆమె నిశ్శబ్దంగా దుఃఖిస్తోందన్న సంగతి అవ్వ గ్రహించలేదు.

పాపం ఆడబిడ్డ... ఒంటరిగా ఉంది. భయపడుతోంది. ఈ హోరుగాలిలో, వర్షంలో చలికి వణుకుతూ చెట్టునీడని ఆశ్రయించింది. కప్పుకోడానికూడా ఏమిలేదు. పల్చటి చీర చెంగు తల మీదుగా కప్పుకుంది అంతే!

అవ్వ సంచీలో కుక్కిన చిరుగుల చీర తీసి సంధ్య భుజాలమీద కప్పింది.

ఏదో సాధించాలన్న తపనతో, తన ఆశయ సిద్ధికోసం బాధ్యతా రహితుడైన సోదరుణ్ణి అభిమానం చంపుకుని సహాయం అర్థించడానికి ఆత్మవిశ్వాసంతో, ధైర్యంతో ఒంటరిగా బయల్దేరి వచ్చిన సంధ్య తానెదుర్కొన్న పరిస్థితికి కుమిలిపోతు వణికిపోతూ అవ్వకప్పిన ఆ చిరుగుల చీరను రెండు చేతుల్తో దగ్గరికి లాక్కుని తననుతాను సంబాళించుకోటానికి ప్రయత్నించింది. ఆమెకి ఇప్పుడా చీరనుండి దుర్గంధం వ్యాపిస్తున్నట్లు అనిపించలేదు. మానవత్వపు పరిమళాలు వెదజల్లుతున్నట్టనిపించింది.

''విపుల''

మే – 96.